సాక్షి
నిర్మల్
గురువారం । 25 । ఏప్రిల్ । 2024



ఒత్తిడిని జయిద్దాం..

ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా జీవితంలో ప్రతీ క్షణాన్ని ఆస్వాదించాలి. ఓటమికి కుంగిపోవద్దు. వైఫల్యాల ఒత్తిడిని అధిగమించాలి.. విజయం సాధించాలి. IIలో▸



అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు

హనుమాన్ జయంతి, మహాదేవుని పౌర్ణమిని పురస్కరించుకుని కుంటాలలో బుధవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు అలరించాయి. మహారాష్ట్ర, తెలంగాణ మల్లయోధులు తలపడ్డారు. IIలో▸



వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం నుంచే వేడి ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బిల్లులు విడుదల చేయండి



వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

నిర్మల్ రూరల్: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ట్రెజరీ కార్యాలయంలో పీఆర్టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.సాయన్న, రవి రాజులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఎంతో కాలంగా సరెండర్ బిల్లులు, పీఆర్సీ ఎరియర్స్, డీఏ, మెడికల్ ఇతరత్రా పెండింగ్ బిల్లులు ఇవ్వడం లేదని వివరించారు. వాటిని త్వరితగతిన విడుదల చేయాలని కోరారు. పాత బిల్లులు కొన్ని రీజనరేట్ అయినా.. పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని కూడా విడుదల చేసేలా చూడాలన్నా రు. వినతిపత్రం ఇచ్చినవారిలో శంకర్, చంద్రశేఖర్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలి

భైంసాటౌన్: విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని ఎస్ఈ జైవంత్‌రావుచౌహాన్ అన్నారు. పట్టణంలోని రాహుల్‌నగర్‌లో బుధవారం భైంసా, బాసర సబ్‌డివిజన్ పరిధిలోని ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ సీఎండీ కె.వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాలు నివారించడంతోపాటు కార్మికులకు నైపుణ్య శిక్షణ అందించాలన్న ఉద్దేశంతో కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేసేటప్పుడు ఎర్త్ రాడ్ వినియోగించాలని, అలాగే విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఈ ఆదిత్య, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న మిత్రుడికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న మిత్రులు

సర్సాపూర్ (జి): మండల కేంద్రానికి చెందిన దర్శనం లక్ష్మణ్(రవి) కొద్ది రోజులుగా తీవ్రమైన కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న సర్సాపూర్(జి) జెడ్పీ ఉన్నత పాఠశాల 2002–03 పదో తరగతి బ్యాచ్ మిత్రులు వైద్య ఖర్చుల నిమిత్తం విరాళాలు పోగుచేశారు. ఈమేరకు వసూలు చేసిన రూ.1,08,821 నగదును లక్ష్మణ్ భార్య స్నేహలతకు అందజేశారు. మిత్రుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మిత్రులు భాస్కర్, శ్రీకాంత్, రాజు, నరేందర్, ఫిరోజ్, నవీన్, సునంద తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ అభ్యర్థిగా జంగుబాపు



బీఫామ్ అందుకుంటున్న జంగుబాపు

ఇచ్చోడ: ఆదిలాబాద్ పార్లమెంట్ బీఎస్పీ అభ్యర్థిగా మెస్రం జంగుబాపు ఖరారయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, సెంట్రల్ కోఆర్డినేటర్ బాలయ్య జంగుబాపునకు బీఫామ్ అందజేశారు. బజార్‌హత్నూర్ మండలం ఎల్లయ్యపల్లె గ్రామానికి చెందిన జంగుబాపు గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ బోథ్ నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేశారు.

బాలికలు భళా..

- ఇంటర్ ఫలితాల్లో వీరిదే హవా..
- గతేడాదికన్నా తగ్గిన ఉత్తీర్ణత శాతం
- ఫస్ట్ ఇయర్‌లో 16.. సెకండియర్‌లో12..
- ఫలితాల్లో జిల్లా స్థానాలు ఇవీ



నిర్మల్ రూరల్: ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో ఈసారి కూడా అమ్మాయిలు అదరగొట్టారు. ఉత్తీర్ణతతో పైచేయి సాధించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బాలికలే ముందంజలో ఉన్నారు. ఫిబ్రవరి నెల 28 నుంచి మార్చి 19 వరకు పరీక్షలు జరిగాయి. మొదటి, ద్వితీయ సంవత్సర ఫలితాలను విద్యాశాఖ కార్యదర్శి బుధవారం విడుదల చేశారు. ఫస్ట్ ఇయర్‌లో 56.05 శాతం మార్కులతో జిల్లా రాష్ట్రంలో 16వ స్థానంలో నిలిచింది. సెకండియర్‌లో 66.17 శాతం మార్కులతో 12వ స్థానంలో నిలిచింది. గతేడాది 69 శాతం ఉత్తీర్ణతతో జిల్లా 9వ స్థానం నిలువగా ఈసారి 12వ స్థానంలో నిలిచింది.

ఫస్ట్ ఇయర్‌లో 56.05 ఉత్తీర్ణత..

ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఫలితాల్లో జిల్లా 16వ స్థానంలో నిలిచింది. మొత్తం 5,467మంది విద్యార్థులు పరీక్ష రాయగా 3,064 మంది(56.05%) పాసయ్యారు. ఇందులో 2,447 మంది బాలురకు 990 మంది(40.46%) ఉత్తీర్ణత సాధించగా, 3,020 మంది బాలికలకు 2074 మంది (68.68 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇక మొదటి సంవత్సరం ఒకేషనల్ కోర్సుల్లో జిల్లాలో 46.36 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. ఈ విభాగంలో రాష్ట్రంలో 27వ స్థానంలో నిలిచింది. మొత్తం 1,072 మంది విద్యార్థులకు 497మంది పాసయ్యారు. ఇందులో 583 మంది బాలురు పరీక్షలకు హాజరుకాగా 191 మంది(32.76%) ఉత్తీర్ణులయ్యారు. 489 మంది బాలికలు పరీక్షలు రాయగా 306 మంది(62.58%) ఉత్తీర్ణులయ్యారు.

సెకండియర్‌లో 66.17 శాతం పాస్...

సెకండియర్ ఫలితాల్లో 66.17 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 5,477 మంది విద్యార్థులకు 3624 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత శాతం 66.17గా ఉంది. ఇందులో 2,469 మంది బాలురకు 1,313 మంది(53.18%) పాసయ్యారు. 3,008 మంది బాలికలకు 2,311 మంది (76.83%) ఉత్తీర్ణులయ్యారు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా బాలుర కంటే బాలికలు మెరుగైన ఫలితాలు సాధించారు. సెకండ్ ఇయర్ ఒకేషనల్ కేటగిరీలో మొత్తం 962 మంది విద్యార్థులకు 572 మంది(59.46%) ఉత్తీర్ణులయ్యారు. బాలురు 543 మంది పరీక్షలు రాయగా 255 మంది పాసయ్యారు. 419 మంది బాలికలు పరీక్షలకు హాజరుకాగా 317 మంది(75.66) పాసయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో జిల్లా రాష్ట్రంలో 28వ స్థానంలో నిలిచింది.

కేజీబీవీలో 89 శాతం మంది పాస్...

జిల్లాలోని 11 కేజీబీవీలలో 89 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. దిలావర్‌పూర్ కేజీబీవీలో ఫస్ట్ ఇయర్‌లో 94%, సెకండ్ ఇయర్‌లో 98%, భైంసాలో ఫస్ట్ ఇయర్‌లో 61.5%, సెకండ్ ఇయర్‌లో 84.5%, జామ్‌లో ఫస్ట్ ఇయర్‌లో 96%, సెకండ్ ఇయర్‌లో 96.5%, లక్ష్మణచాందా ఫస్టియర్‌లో 80.5%, సెకండియర్‌లో 96%, పెంబిలో ఫస్ట్ ఇయర్‌లో 100%, సర్సాపూర్ ఫస్టియర్ 93%, సెకండ్ ఇయర్ 100%, దస్తురాబాద్ ఫస్టియర్ 97.5%, సెకండ్ ఇయర్ 97.5%, నిర్మల అర్బన్ ఫస్టియర్ 80%, సెకండియర్ ఇయర్‌లో 82.5%, మామడ ఫస్ట్ ఇయర్ 79.5%, సెకండ్ ఇయర్ 81.2%, కడెం ఫస్ట్ ఇయర్ 96.5%, సెకండ్ ఇయర్ 100%, ముధోల్ ఫస్ట్ ఇయర్ 68.5%, సెకండ్ ఇయర్‌లో 80.5% ఉత్తీర్ణత నమోదయింది.

ప్రైవేటు కేటగిరీలో 44.64% మంది పాస్..

ఇంటర్ ఫలితాల్లో సెకండియర్‌లో ప్రైవేట్ కేటగిరీ లో జిల్లా వ్యాప్తంగా 44.64 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. మొత్తం 298 మంది విద్యార్థులకు102 మంది పాసయ్యారు. ఇందులో 186 మంది బాలురకు 52 మంది ఉత్తీర్ణులయ్యారు. 112 మంది బాలికలకు 50 మంది పాసయ్యారు. ప్రైవేటు కేట గిరీ విభాగంలో ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో 4వ స్థానంలో నిలిచింది. ఒకేషనల్ ప్రైవేట్ కేటగిరీలో సె కండ్ ఇయర్ ఫలితాల్లో జిల్లాకు 31వ స్థానం దక్కింది. మొత్తం 76 మంది విద్యార్థులకు 24 మంది పా సయ్యారు. ఇందులో 66 మంది బాలురకు 19 మంది పాసవగా, పది మంది బాలికలకు ఐదుగురు పాసయ్యారు.

పడిపోయిన జిల్లా స్థానం..

ఇక ఇంటర్ ఫలితాల్లో గతేడాదితో పోలిస్తే ఈసారి జిల్లా ర్యాంకు పడిపోయింది. గతేడాది ప్రథమ సంవత్సరంలో 62 శాతం ఉత్తీర్ణతతో 8వ స్థానంలో నిలువగా ఈసారి 56 శాతంతో 16వ స్థానంలో నిలిచింది. సెకండియర్‌లో గతేడాది 69 శాతం ఉత్తీర్ణతతో 9వ స్థానంలో నిలువగా, ఈసారి 66 శాతం మార్కులతో 12వ స్థానంలో నిలిచింది.

భైంసా విద్యార్థినికి స్టేట్ సెకండ్ ర్యాంకు



తల్లిదండ్రులతో సృజన, బైపీసీ(437/440)

భైంసాటౌన్: ఇంటర్ ఫలితాల్లో పట్టణంలోని రాహుల్ నగర్‌కు చెందిన గడపాలే సృజన రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గడపాలే అంబదాస్ కూతురు సృజన హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ పూర్తి చేసింది. గతనెలలో పరీక్షలు రాసింది. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో బైపీసీ విభాగంలో 440 మార్కులకు 437 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించింది.

పేదింటి విద్యా కుసుమం



975 మార్కులు సాధించిన షణ్ముఖ

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట చెప్పులు కుడుతూ జీవనం సాగించే నిరుపేద మధు కూతురు షణ్ముఖ ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. ఎంపీసీలో 1000 మార్కులకు 975 మార్కులు సాధించింది. ప్రథమ సంవత్సరంలోనూ 458 మా ర్కులు సాధించింది. షణ్ముఖ 5 నుంచి పదో తరగతి వరకు ఖానాపూర్‌లోని మహాత్మాజోతిబాపూలే పాఠశాలలో చదువుకుంది. పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించింది. ప్రస్తుతం ఇంటర్ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే కళాశాలలో పూర్తి చేసింది.

గడువులోపు పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: విద్యా సంవత్సరం ముగిసి వేసవి సెలవులు ప్రారంభమైనందున అమ్మ ఆదర్శ పాఠశాల పనులు ప్రారంభించి గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మ ఆద ర్శ పాఠశాల్లో చేపట్టనున్న పనులపై సంబంధిత శా ఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 672 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యాల కల్పన, మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ, స్లాబ్‌ల మరమ్మతు, గ్రిల్స్ ఏ ర్పాటు, సౌర ఫలకాల ఏర్పాటు, ఇతర మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యార్థులకు తాగునీటికి కోసం రెండు ట్యాప్‌ల ద్వారా ఫిల్టర్ వాటర్ అందించాలన్నారు. నీటి అవసరాల కోసం అన్ని పాఠశాలల్లో మిషన్ భగీరథ కనెక్షన్లు తీసుకోవాలని సూచించారు. అవసరమైన పాఠశాలల్లో బోర్లు వేయించాలని తెలిపారు. విద్యుత్ పనుల్లో భాగంగా తరగతి గదుల్లో బోర్డు పైన, కిటికీల దగ్గర ట్యూబ్ లైట్లు అమర్చాలన్నారు. రెండు ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. వరండాలో ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటుతోపాటు పాఠశాల నేమ్ బోర్డు వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని వివరించారు. నిధులు అవసరమగు పనులు మాత్రమే ఖర్చు చేయాలని సూచించారు. కిటికీలు, తలుపుల మరమ్మతులు చేపట్టాలని, పనుల్లో నాణ్యమైన సామగ్రిని ఉపయోగించాలని సూచించారు. పనులు ప్రారంభించడానికి ముందు, పూర్తి అయిన తరవాత ఫొటోలతో కూడిన నివేదికలను సమర్పించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలో మరుగుదొడ్లను ఈజీఎస్ కింద నిర్మించాలని సూచించారు. జిల్లాలోని కేజీబీవీలు, టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ పాఠశాలల్లోనూ పనులు చేపట్టాలని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులన్నీ మండలస్థాయి అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీ వో విజయలక్ష్మి, డీఈవో రవీందర్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు శంకరయ్య, అశోక్‌కుమార్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు భత్యం..!

- నిధులు విడుదల చేసిన విద్యాశాఖ
- నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ

వివరాలు...	
జిల్లాలో భవిత కేంద్రాలు	19
విద్యార్థులు	514
ఐఈఆర్‌పీలు	31
విడుదలైన నిధులు	రూ.16.72 లక్షలు



భైంసా భవిత కేంద్రంలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఐఈఆర్‌పీ

నిర్మల్ రూరల్: భవిత, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే దివ్యాంగ, ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యాశాఖ భత్యం విడుదల చేసింది. దివ్యాంగ విద్యార్థులకు విద్యతోపాటు ఇతర అంశాలపై కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, కేంద్రాలకు రాలేని వారికి ఇంటి వద్దనే శిక్షణ ఇచ్చి వారిలో క్రమంగా మార్పు తీసుకురావడం కోసం ప్రభుత్వం విలీన విద్యా వనరుల కేంద్రాలు(ఐఈఆర్‌సీ) ఏర్పాటు చేశాయి. వీటినే భవిత కేంద్రాలు అంటారు. ఆర్థికంగా వెనుకబడి, తమ దివ్యాంగులైన చిన్నారులను శిక్షణకు తీసుకురాలేని కుటుంబాలకు నెలనెలా రవాణా, ఎస్కార్ట్, స్టైఫండ్, రీడింగ్ అలవెన్స్ రూపంలో భత్యం అందజేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ఈ నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర శిక్ష తెలంగాణ, పీఎంశ్రీ ఆధ్వర్యంలో సమకూరుస్తున్నాయి. 2023– 24 విద్యా సంవత్సరానికి సంబంధించిన జూన్ నుంచి మార్చి వరకు 10 నెలలకు సంబంధించిన నిధులను ఇటీవలే నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేశారు. దీంతో ఏడాదిగా ఎదురుచూస్తున్న దివ్యాంగ పిల్లలకు ఉపశమనం కలిగింది.

జిల్లాలో 19 భవిత కేంద్రాలు..

మానసిక, శారీరక వైకల్యం కలిగిన బాల, బాలికలకు వివిధ పద్ధతుల్లో విద్యను అందించడానికి ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో 19 కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఐఈఆర్‌పీ(ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)లు చిన్నారులకు శిక్షణ ఇచ్చి సాధారణ పిల్లల మాదిరిగా తీర్చిదిద్దుతుంటారు. కేంద్రాలకు రాలేని మానసిక వైకల్యం ఉన్నవారికి ఇంటి వద్దకే వెళ్లి నైపుణ్యాలు నేర్పిస్తారు. జిల్లాలో 514 మంది దివ్యాంగులైన బాలబాలికలు భవిత కేంద్రాలలో శిక్షణ పొందుతుండగా 31 మంది శిక్షకులు విధులు నిర్వహిస్తున్నారు.

రూ.16.72 లక్షలు విడుదల..

జిల్లాలోని 19 కేంద్రాలలో చదువుతున్న 514 మంది విద్యార్థులకు 10 నెలలకు సంబంధించిన భత్యం నిధులు రూ.16.72 లక్షలను విద్యాశాఖ విడుదల చేసింది. నేరుగా విద్యార్థుల ఖాతాలలో జమ చేశారు. భవిత కేంద్రాల్లో చదివే విద్యార్థులకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ పేరుతో నెలకు రూ.500 ఇస్తారు. 10 నెలలకు సంబంధించి రూ.6.10 లక్షలు జమ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే దివ్యాంగ విద్యార్థులను తీసుకువచ్చేందుకు వారి తల్లిదండ్రులకు ఎస్కార్ట్ అలవెన్స్ నెలకు రూ.500 ఇస్తారు ఈ పాఠశాలల్లో చదివే 96 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు రూ.5,28,000 విడుదల చేశారు. భవిత, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే దివ్యాంగ బాలికలకు ప్రత్యేకంగా స్టైఫండ్ చెల్లిస్తారు. 255 మంది బాలికలకు నెలకు రూ.200 చొప్పున రూ 5,10,000 వారి ఖాతాల్లో వేశారు.

సొంత భవనాలు లేక..

జిల్లాలో 19 భవిత కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఇందులో మెజారిటీ సెంటర్లకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఖానాపూర్, ముధోల్, భైంసా పట్టణాల్లో మాత్రమే భవిత కేంద్రాలకు ప్రత్యేక భవనాలు ఉన్నాయి. మిగతా కేంద్రాలను దగ్గరలోని ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వానికి ఇప్పటికే పలుమార్లు నివేదిక అందజేశామని, మంజూరు కోసం ఎదురుచూస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా రిసోర్స్ పర్సన్లు 38 పోస్టులకు 31 మంది పని చేస్తున్నారు. 7 ఖాళీలు ఉన్నాయి వచ్చే విద్యా సంవత్సరంలో వీటిని భర్తీ చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

వీటితోపాటు 41 మందికి రీడర్ అలవెన్స్ పేరుతో నెలకు రూ.60 చొప్పున ఇచ్చారు. మొత్తం నిధులు రూ.16,72,600 లబ్ధిదారుల ఖాతాల్లో ఇప్పటికే జమ చేశారు. విద్యార్థుల సంఖ్య పరంగా భైంసా మండలానికి అత్యధికంగా రూ.3,34,000 విడుదల కాగా, అత్యల్పంగా పెంబి మండలానికి రూ.5 వేలు విడుదలయ్యాయి. వచ్చే ఏడాది నుంచి భత్యం సంవత్సరం చివరిలో కాకుండా ప్రతినెలా విడుదల చేసేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థుల ఖాతాల్లో జమ



పాఠశాలలు, భవిత కేంద్రాలు, ఇంటి వద్ద శిక్షణ పొందుతున్న దివ్యాంగుల పిల్లలకు ప్రభుత్వం ఏటా రవాణా, ఎస్కార్ట్, స్టైఫండ్, రీడింగ్ అలవెన్స్‌లు అందజేస్తుంది. ప్రస్తుతం లబ్ధిదారులైన విద్యార్థుల ఖాతాలో ప్రభుత్వమే నేరుగా డబ్బులను జమ చేసింది. ఈ నిధులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జిల్లా అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ స్టాటిక్ సర్వేలైన్స్ టీంలు, ఎక్స్‌పెండీచర్ టీంలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన వృద్ధులకు, ఓటింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన రిపోర్టులను సమయానికి పంపాలన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున పోలింగ్ కేంద్రాల్లో టెంట్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్‌కి సంబంధించిన అన్ని సూచనలు బోర్డు రూపంలో ఏర్పాటు చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో పుకార్లు వ్యాపించకుండా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. నిఘా, ఎన్నికల బృందాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, డీఆర్వో భుజంగరావు, డీఆర్డీవో విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో గోవింద్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రచార ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి

నిర్మల్‌చైన్‌గేట్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా లోకల్ ఛానెళ్లు, దినపత్రికల్లో రాజకీయ పార్టీల ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. తన కలెక్టర్ చాంబర్‌లో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సభ్యులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే పెయిడ్ న్యూస్‌ను గుర్తించాలని ఆదేశించారు. రోజువారీ గుర్తించిన చెల్లింపు వార్తల విలువ లెక్కగట్టి ఎన్నికల వ్యయ విభాగానికి రిపోర్టు ఇవ్వాలని తెలిపారు. క్రమం తప్పకుండా అన్ని వార్తా పత్రికలను పరిశీలించాలని, ఎంసీఎంసీ కమిటీకి సంబంధిన అన్ని రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో భుజంగరావు, డీపీఆర్వో విష్ణువర్ధన్, ఎంసీఎంసీ కమిటీ సభ్యులు షేక్ హయత్, ముఖీమ్‌ఉద్దీన్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లికి వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. దీంతో కాలనీ మహిళలు బుధవారం రోడ్డెక్కారు. ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. మున్సిపల్ నల్లాలతోపాటు, మిషన్ భగీరథ నల్లాల ద్వారా వారం రోజులుగా నీరు రావడం లేదని తెలిపారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ డి.రాజారెడ్డి, బీజేపీ నాయకులు గాలి రవి అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావును ఫోన్‌లో సంప్రదించగా, మున్సిపల్ సిబ్బంది చేరుకుని వెంటనే సమస్య పరిష్కరించారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు.

నామినేషన్ల జాతర

- ఏడోరోజు 12 నామినేషన్లు
- ఒకేరోజు నాలుగు సెట్లు వేసిన బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్
- నేటితో ముగియనున్న ప్రక్రియ

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఏడోరోజు జాతరలా కొనసాగింది. బుధవారం అత్యధికంగా 12 నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ నాలుగు సెట్లు దాఖలు చేశారు. తొలి సెట్‌ను పార్టీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు అందజేశారు. రెండో సెట్‌ను పార్టీ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రాజేశ్‌బాబు, అశోక్ ముస్తాపురే, జ్యోతితో కలిసి దాఖలు చేశారు. మూడో సెట్‌ను ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆరెల్లి మల్లేశ్, పార్టీ నాయకులు వేదవ్యాస్, కైలాస్, పద్మ అందజేశారు. నాలుగో సెట్‌ను పార్టీ కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్, కొత్తపల్లి శ్రీనివాస్, జ్యోతిరెడ్డి, మయూర్‌తో కలిసి గోడం నగేశ్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు తరఫున జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, నాయకులు దుర్వ నగేశ్, పురుషోత్తం యాదవ్, డాక్టర్ కిరణ్‌కుమార్, సాజిదొద్దీన్ మూడో సెట్ దాఖలు చేశారు. నాలుగో సెట్‌ను పడకంటి రమాదేవి, సోనేరావు, బుర్స పోచయ్య, దత్తు, శంకర్ అందజేశారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కంది శ్రీనివాసరెడ్డి, కరీం, అఫ్రోజ్‌తో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ మూడో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ తరఫున మాజీ ఎంపీ రమేశ్‌రాథోడ్, ఇండిపెండెంట్లుగా రాథోడ్ సుభాష్, నేతావత్ రాందాస్, కొమురం మంతాయ్య, గొండ్వాన దండకారణ్య పార్టీ తరఫున కొడప వామనరావు నామినేషన్లు వేశారు.



నామినేషన్ వేస్తున్న నగేశ్, పక్కన ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, శంకర్, రామారావు పటేల్, హరీశ్‌బాబు

ఆర్వో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజ ర్షి షాకు నామినేషన్ పత్రాలు అందజేశారు. బుధవారం నాటికి నామినేషన్ల సంఖ్య 24కు చేరింది. కాగా, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం మధ్యాహ్నం 3గంటలకు ముగియనుంది. చివరిరోజు ఎన్ని నామినేషన్లు దాఖలవుతాయనే దానిపై ఆసక్తి నెలకొంది.

ముగిసిన జాతీయ సెమినార్

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండురోజులు నిర్వహించిన జాతీయ సెమినార్ బుధవారం ముగిసింది. అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో వివిధ యూనివర్సిటీ రీసెర్చి స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ముథోల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కార్తీక్ ముఖ్య అతిథిగా హాజరై వ్యవసాయంలో నూతన పద్ధతులు, ఇతర అంశాలపై వివరించారు. వివిధ యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు ఆన్‌లైన్ వేదికగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్, అర్థశాస్త్రం విభాగం అధ్యాపకురాలు ఎం.సరస్వతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అడవిపంది దాడిలో రైతుకు గాయాలు


చికిత్స పొందుతున్న బాలాజీ

ఇంద్రవెల్లి: అడవిపంది దాడిలో రైతుకు గాయాలైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం భీంనగర్‌కు చెందిన కంజే బాలాజీ మంగళవారం సాయంత్రం పంటచేనులో వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండగా అకస్మాత్తుగా అడవిపంది దాడి చేసి గాయపర్చింది. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

చుక్కలదుప్పిని కాపాడిన ఉపాధి కూలీలు


దుప్పిని తరలిస్తున్న అటవీశాఖ అధికారులు

దస్తురాబాద్: మండలంలోని ఆకొండపేట గ్రామ సమీపంలోని అటవీప్రాంతంలో బుధవారం ఉపాధిహామీ కూలీలు చుక్కల దుప్పిని కాపాడారు. అటవీ ప్రాంతంలో ఉపాధి హామీ కూలీలు కందకాల పనులు చేస్తుండగా చుక్కల దుప్పిని కుక్కలు వెంబడించాయి. స్పందించిన కూలీలు కుక్కల బారి నుంచి దుప్పిని కాపాడి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వచ్చి దుప్పిని తీసుకెళ్లి అడవిలో వదిలేసినట్లు డిప్యూటీ రేంజర్ సిద్దార్థ తెలిపారు.

నగదు పట్టివేత


నగదు సీజ్ చేస్తున్న పోలీసులు

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద రూ.లక్ష నగదు పట్టుకున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ అస్లం తన కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద ఎఫ్ఎస్‌టీ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. అతని వద్ద ఎలాంటి రసీదులు లేకుండా ఉన్న లక్ష నగదును గుర్తించడంతో సీజ్ చేసి జిల్లా గ్రీవెన్స్ టీంకు అప్పగించినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

కుంటాల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. కుంటాల బస్టాండ్ ఆవరణలో ఇటీవల రెండు చెట్లు నరకి వేయడంపై ఫిర్యాదు అందడంతో ఆయన బుధవారం వాటిని పరిశీలించారు.

ఒత్తిడిని జయిద్దాం.. విజయం సాధిద్దాం..

- చదువులో తప్పితే... జీవితంలో ఓడినట్లు కాదు
- ఓటమి గెలుపునకు నాంది కావాలి
- ఇంటర్ ఫలితాల విడుదలతో విద్యార్థులపై ఒత్తిడి
- మంచిర్యాల జిల్లాలో ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య
- తల్లిదండ్రుల భరోసా ఎంతో ముఖ్యమంటున్న నిపుణులు
- 14416 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా సలహాలు, సూచనలు



మానసిక, డిప్రెషన్ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్



మంచిర్యాలటౌన్: పరీక్షలు బాగానే రాశామని అనుకుని తీరా ఫలితాలు విడుదలయ్యాక మార్కులు తక్కువగా వచ్చాయనో, ఫెయిల్ అయ్యామనో.. జీవితం ఇక ఇంతే అనుకుని కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా జీవితంలో ప్రతీ క్షణాన్ని ఆస్వాదించాలే గాని చీకటికి భయపడితే రేపటి ఉదయాన్ని చూడలేమనే విషయాన్ని విద్యార్థులు గుర్తించాలి. జీవితానికి పునాది వేసే విద్యార్థి దశలో ఎన్నోరకాల ఆటుపోట్లు సహజంగా వస్తుంటాయి. వాటిని ఎదురీది నేడు ఉన్నతస్థానానికి ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలి. అంతేకానీ ఆత్మహత్యలకు పాల్పడి కన్నవారికి కడుపుకోతను మిగిల్చి నిండు జీవితాన్ని అర్ధంతరంగా చాలించవద్దని మానసిక వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

పరీక్షలకు ముందే భరోసా ఇస్తేనే..

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఉత్తీర్ణత శాతం తక్కువగా నమోదైంది. ఇందులో ఇద్దరు జిల్లా విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. పరీక్షలో తప్పామని, మార్కులు తక్కువగా వచ్చాయనే కారణాలతో ఆత్మహత్యకు పాల్పడే ధైర్యం ఉన్న వారు ఆ ధైర్యాన్ని జీవితంలో ఎదిగేందుకు ఉపయోగిస్తే అనుకున్నది సాధించే అవకాశం ఉందని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థులు చదువులో ఒత్తిడిని లేకుండా ముందునుంచే చూడాలి. చదువు, ఆతర్వాత పరీక్షలు వంటి అంశాలపై విద్యార్థుల మానసిక ప్రభావం ఎంతగానో ఉంటుందని ముందుగానే గుర్తించి తల్లిదండ్రులు పిల్లల్లో భరోసా కల్పిస్తే ఫలితాలు వెలువడే నాటికి వారిలో ఫెయిల్ అయ్యామనే ఆత్మన్యూనతా భావం తొలగిపోయి సప్లమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతారు. పిల్లలకు చిన్ననాటి నుంచే చదువుతో పాటు వారి భవిష్యత్‌పై అవగాహన కల్పించాలి. తరచూ ఇరుగు పొరుగు పిల్లలతో పోల్చడం, ఇతరుల కంటే ఎందుకూ పనికి రారని పల్చన చేయడం వంటివి చేయవద్దు. వారితో సన్నిహితంగా ఉంటూ ప్రోత్సహించాలి. జీవితంలో చదువు ఒక్కటే కాదని ధైర్యంగా ఎలాంటి వాటినైనా ఎదుర్కొంటామనే భరోసా నింపాలి.

ఆత్మహత్యా భావన వస్తే కాల్ చేయండి

పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయని ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు వచ్చే వారికి మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో ఏర్పాటు చేసిన మెంటల్ హెల్త్ క్లినిక్‌లో సైక్రియాట్రిస్టు ద్వారా కౌన్సిలింగ్ ఇచ్చి భరోసా కల్పిస్తున్నారు. సమస్యలతో వచ్చిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి మందులు ఇస్తున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు క్లీనిక్ తెరిచి ఉంచుతున్నారు. విద్యార్థులు చదువులో వెనుకబడటం, ఏకాగ్రత లోపించడం, అధిక చురుకుతనం, తరచూ కోపం తెచ్చుకోవడం, దూకుడుతనం, శారీరక, మానసిక అభివృద్ధి ఆలస్యం మొదలైన సమస్యలకు తగిన సలహాలు, సూచనలు, అవసరమైన చికిత్సను తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్న వారి కోసం టెలీమానస్ 14416 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారు.

తల్లిదండ్రులు, టీచర్ల సపోర్టు ఉండాలి



స్ట్రెస్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంను పిల్లలతో పాటు తల్లిదండ్రులు, లెక్చరర్లకు అవగాహన కల్పించాలి. ఒక పరీక్ష ఫెయిల్ అయితే జీవితం ఆగిపోతుందనే భావన తొలగిపోవాలి. తల్లిదండ్రులు, టీచర్ల నుంచి సపోర్టు వస్తే విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరగడంతో పాటు ఫెయిల్ అయినా మా తల్లిదండ్రులు అర్థం చేసుకుంటారనే భరోసా కలిగి ఉంటారు. ఆత్మహత్య చేసుకునే వరకు వెళ్లే అవకాశం ఉండదు.

– డాక్టర్ సునీల్ కుమార్, సైకియాట్రిస్టు, జిల్లా మానసిక ఆరోగ్య క్లినిక్, జీజీహెచ్

ఓటమిని ఎదుర్కోవడం నేర్పించాలి



ప్రతి ఒక్కరూ వారి పిల్లలకు గెలుపు ఎలా ఉండాలనే నేర్పిస్తారు. కానీ ఓటమిని ఎదుర్కోవడాన్ని నేర్పించరు. ఆత్మహత్య చేసుకునే వారిలో ఎక్కువగా సొసైటీకి భయపడి, ఎవరో ఏదో అనుకుంటారనే భయం వల్లనే. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పాఠాలను చదవాలి. పరీక్షల నాటికే అన్నీ ఒక్కసారిగా చదువుతామంటే పరీక్షల్లో ఏంరాయలేని పరిస్థితి నెలకొని ఫలితాలపై ప్రభావం చూపుతుంది. పిల్లలపై ఎక్కువగా ఒత్తిడి చేయకుండా, స్వేచ్ఛగా చదువుకునేలా తల్లిదండ్రులు, అధ్యాపకులు చూడాలి.

– డాక్టర్ కవిత, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, ప్రముఖ సైకాలజిస్టు

సీఎం రేవంత్‌రెడ్డిపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కైలాస్‌నగర్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషాకు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయనను కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈనెల 22న జిల్లా కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ఓటర్లను ప్రభావితం చేసేలా, భయభ్రాంతులకు గురిచేసేలా సీఎం ప్రసంగించారని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు విజ్జగిరి నారాయణ, జగదీష్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఉట్నూర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నేరడిగొండ మండలానికి చెందిన శేఖర్ తన భార్య మౌనిక (25), కుమారుడు ఆదిత్యతో కలిసి ద్విచక్ర వాహనంపై ఉట్నూర్ వైపు వస్తుండగా పులిమడుగు మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడింది. మౌనికకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. శేఖర్, ఆదిత్యకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించి క్షతగాత్రులను ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.

అలరించిన అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు

- పోటీల్లో తలపడిన మల్లయోధులు
- బండరాయి ఎత్తిన బాహుబలులు


కుస్తీపోటీలో తలపడుతున్న మల్లయోధులు

కుంటాల: హనుమాన్ జయంతి, మహాదేవుని పౌర్ణమిని పురస్కరించుకుని కుంటాలలో బుధవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు అలరించాయి. పోటీల్లో మహారాష్ట్ర, తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో మల్లయోధులు తలపడ్డారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కర్కెల్లి గ్రామానికి చెందిన గణేశ్ ఒంటిచేతితో కుస్తీ పోటీల్లో తలపడి సత్తా చాటాడు. మొత్తం 70 పోటీలు నిర్వహించగా నాందేడ్ కుచెందిన మారుతిపై నిర్మల్‌కు చెందిన సాయినాథ్ విజయం సాధించాడు. మొదటి విజేత సాయినాథ్‌కు రూ.5వేల నగదుతో పాటు వెండి కడియం, రెండో విజేత మారుతికి రూ.2,500 నగదుతో పాటు సన్మానించారు. విజేతలను భాజాభజంత్రీలతో మహాదేవుని ఆలయం వరకు తీసుకెళ్లారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం అంబలి పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్సై రజినీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బండరాయి ఎత్తిన బాహుబలులు


జక్కుల గజేందర్


ఎల్లమ్మల గజేందర్

హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం రాత్రి వెయిట్ లిఫ్టింగ్ పోటీల మాదిరిగానే బండరాయి ఎత్తే పోటీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎల్లమ్మల గజేందర్, జక్కుల గజేందర్, జక్కుల పండరి సుమారు 120 కేజీల బరువుగల బండరాయిని ఎత్తి బాహుబలులు అనిపించుకున్నారు. మరో 60 కేజీల బండరాయిని పలువురు యువకులు ఎత్తి సత్తా చాటారు. వారిని గ్రామస్తులు సన్మానించారు. అనంతరం మహాదేవుని జెండాలను భాజాభజంత్రీలతో ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీజేపీ అభ్యర్థి గొడం నగేష్ ఆస్తులు

కైలాస్‌నగర్: బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేష్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. అఫిడవిట్‌లో ఆస్తులతోపాటు అప్పులు, కేసులు, ఆభరణాల వివరాలు వెల్లడించారు. స్థిర, చరాస్తులు రూ.1.62కోట్లు ఉన్నట్లు తెలిపారు. అందులో చరాస్తులు రూ.18,92,674, స్థిరాస్తులు రూ.6,71,765, రూ.22,64,828 ఉన్నట్లుగా వివరించారు. తన భార్య పేరిట చరాస్తులు రూ.24,79,121, స్థిరాస్తులు రూ.29,05,350 కలిపి మొత్తం రూ.76.92లక్షలు ఉన్నట్లు పేర్కొన్నారు. కూతురి పేరిట రూ.3,75,038 ఉండగా స్థిరాస్తులు రూ.10.63 లక్షలు, కుమారుడి పేరిట చరాస్తులు రూ.2.78లక్షలు ఉన్నట్లు తెలిపారు. తన పేరిట రూ.7.49లక్షలు విలువైన వాహనం, రూ.7.60లక్షల విలువైన బంగారం, తన భార్య పేరిట రూ.15.20లక్షలు విలువైన బంగారం ఉన్నట్లు తెలిపారు. పిల్లల పేరిట రూ.4.56 లక్షల విలువైన 60 గ్రాముల బంగారం ఉందని పేర్కొన్నారు. జాతర్ల, దేగామ, అడెగాంలో తన పేరిట 14.30 ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా, వాటి విలువ రూ.58 లక్షలుగా పేర్కొన్నారు. తన భార్య పేరిట ఇచ్చోడ, ఇంద్రవెల్లిలో 17.28 ఎకరాల భూములు ఉండగా వాటి విలువ రూ.56.92 లక్షలుగా తెలిపారు. తన భార్య పేరిట ఆదిలాబాద్‌లో అయ్యప్ప ఎర్త్ మూవర్స్, ఇచ్చోడలోని శ్రీసాయి ఫిల్లింగ్ స్టేషన్‌లో వాటాలు ఉన్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంతోపాటు జాతర్లలో ఇళ్లు ఉండగా, తన భార్య పేరిట సికింద్రాబాద్‌లో, కుమారుడి పేరిట న్యూ హౌజింగ్ బోర్డు కాలనీలో ప్లాట్లు ఉన్నట్లు వివరించారు. కాగా తనకు వివిధ బ్యాంకుల్లో రూ.10 లక్షల 50వేల అప్పులు ఉండగా తన కూతురి పేరిట రూ.18 లక్షల 51వేల 575 అప్పులు ఉన్నట్లుగా తెలిపారు. తనపై రెండు పోలీసు కేసులు ఉన్నట్లుగా వివరించారు.

‘అల్ఫోర్స్’ చరిత్రాత్మక విజయం


అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో నిర్మల్ అల్ఫోర్స్ జూనియర్ కళాశాల చరిత్రాత్మక విజయం సాధించిందని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బి.రుతిక, ఎస్.హిమబిందు, డి.సాహితి 467 మార్కులు, జె.నవ్యశ్రీ, సీహెచ్ సంపద, ఎస్.శ్రీభావన 466 మార్కులు, ఎస్.పుష్పాంజలి 465, ఎం.రిషిత 465 మార్కులతో రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలిచారన్నారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకుగానూ ఎస్.కవల్ ప్రీత్ కౌర్, ఎం.ప్రీతి 437, సాహిస్తా తరన్నం 436 మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ మారియా మహావీన్ 991, బైపీసీ విభాగంలో ఎం.సాధన 989 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

‘ఎస్ఆర్’ విద్యార్థుల విజయకేతనం


విజయకేతనం చూపుతున్న విద్యార్థులు

నిర్మల్‌రూరల్: ఇంటర్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. సెకండ్ ఇయర్‌లో బైపీసీ విభాగంలో సీహెచ్ అక్షయ 990, శ్వేత 983, స్నేహ 982 మార్కులు సాధించారు. ఎంపీసీ భాగంలో కీర్తి, శ్రేష్ఠ 988 మార్కులు సాధించారు. ఫస్ట్ ఇయర్ బైపీసీ విభాగంలో వైష్ణవి 437, శ్రీహర్ష 436, ఎంపీసీలో శ్రీనిధి 466, వైష్ణవి 466, మహేశ్వరి 465 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల డీజీఎం గోవర్ధన్ రెడ్డి శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి దేవిదాస్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభ్యున్నతి

- ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ


ప్రచారం చేస్తున్న ఆత్రం సుగుణ

బేల: కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాల అభ్యున్నతి సాధ్యమని ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వారసంతలో ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అమ్మకందారులు, కొనుగోలుదారులతో మాట్లాడి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. దీంతో పాటు మార్కెట్ కూడలిలోని దుకాణాల్లో అభివాదం చేస్తూ విన్నూత్నంగా ప్రచారం చేశారు. రోడ్‌షోలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అర్హులైన నిరుపేదలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్, రూ.500కే వంటింటి గ్యాస్, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం రూ.10లక్షల పెంచడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు, తదితర పథకాలు అందిస్తుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, బ్లాక్ అధ్యక్షుడు గుండవార్ సంజయ్, నాయకులు వాంఖడే వామన్, సుధాంరెడ్డి, బొర్రే శంకర్, కన్యరాజు, మడావి చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో విస్తృత ప్రచారం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ బుధవారం పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉదయం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియానికి చేరుకుని వాకింగ్‌కు వచ్చిన వారిని కలిశారు. వారితో వాకింగ్ చేస్తు కాసేపు మాట్లాడారు. వారి నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి ఎన్టీఆర్‌చౌక్‌కు చేరుకుని చౌక్‌లోని పలు హోటళ్లు, దుకాణాలకు వెళ్లి కరపత్రాలు, స్టిక్కర్లను అందజేస్తు చేతు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుగుణ

కైలాస్‌నగర్: పట్టణంలోని ప్రజాసేవభవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో జైనథ్ మండలం నిరాల గ్రామస్తులు, మైనార్టీ యువకులు, పట్టణంలోని టీచర్స్ కాలనీ, విద్యానగర్, బంగారి గూడ కాలనీలకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, కౌన్సిలర్ దర్శనాల లక్ష్మణ్, నాయకులు రషీద్, ఆశమ్మ, లోక ప్రవీణ్‌రెడ్డి, శ్రీలేఖ, ఎంఏ షకీల్, తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం


నేలకొరిగిన జొన్నపంట

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఈదురుగాలులతో పాటు గంటకు పైగా జోరుగా వర్షం కురిసింది. తాంసి, పొన్నారి, హస్నాపూర్, వడ్డాడి, కప్పర్ల, బండల్ నాగాపూర్, గిరిగాంతో పాటు పలు గ్రామాల్లో వర్షం కురిసింది. కోతకు వచ్చిన జొన్నతో పాటు వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. ఆరబెట్టిన జొన్నపంటలు సైతం తడిసిపోవడంతో కొంతమేర నష్టం వాటిల్లింది.

సోయా కంపెనీ ప్రతినిధుల నిర్బంధం


రైతుల నిర్బంధంలో కంపెనీ ప్రతినిధులు

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన పలువురు రైతులు బుధవారం ఒక సోయా కంపెనీకి చెందిన ప్రతినిధులను పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. వివరాలు.. యాసంగిలో వడ్డాడి గ్రామానికి చెందిన 50 మంది రైతులు దాదాపు 200 ఎకరాల్లో ప్రముఖ కంపెనీకి చెందిన సోయా విత్తనాలు సాగుచేశారు. పంట ఏపుగా పెరిగినా పూత, కాత సరిగా రాలేదు. దిగుబడి అనుకున్నంత రాక రైతులు నష్టపోయారు. విత్తనాలు నాణ్యతగా లేకపోవడంతోనే పంట ఎదగక దిగుబడి తగ్గిందని రైతులు ఆరోపించారు. వారంక్రితం వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించారు. ఏఈవో పంటను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించారు. కాగా, బుధవారం సోయా పంటను పరిశీలించడానికి వచ్చిన విత్తన కంపెనీ ప్రతినిధులను వడ్డాడి రైతులు పంచాయతీ కార్యాలయం వద్ద నిలదీశారు. విత్తనాలు బాగా లేక పంట దిగుబడి రాలేదని ఆగ్రహించారు. కంపెనీ తరపున పరిహారం అందించి ఆదుకోవాలని, లేని పక్షంలో పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి బయటకు వెళ్లనివ్వమని హెచ్చరించారు. కంపెనీ ప్రతినిధుల సమాచారం మేరకు తాంసి పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను సముదాయించారు. అక్కడి నుంచి కంపెనీ ప్రతినిధులిద్దరిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పరారీలో ఉన్న హోంగార్డు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అనిల్

నిర్మల్‌టౌన్: ఇటీవల ప్రజలను మోసగిస్తూ పరారీలో ఉన్న హోంగార్డు షమీ ఉల్లాఖాన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ అనిల్ తెలిపారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. సదరు హోంగార్డు కొన్ని రోజుల క్రితం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తుండేవాడు. ఆ సమయంలో పట్టణంలోని పలువురితో పరిచయం పెంచుకున్నాడు. తాను భవన నిర్మాణానికి సంబంధించిన సామగ్రి కంపనీలకు ఏజెంట్‌గా పనిచేస్తానని, తక్కువ ధరకు సామగ్రి ఇప్పిస్తానని చెప్పి పలువురి వద్ద నుంచి డబ్బులు తీసుకుని సామగ్రి ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. అడిగితే ఇంకా ఏమైనా గిరాకీ ఇప్పిస్తేనే మీ డబ్బులు మీకు తిరిగి ఇప్పిస్తానని బెదిరించాడు. చీటింగ్ కేసులో పరారీలో ఉన్న హోంగార్డును జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు పట్టణ పోలీసులు కొన్ని బృందాలుగా ఏర్పడి బుధవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ జానకీ షర్మిల


జిల్లా ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: సైబర్ నేరాలపై జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. సైబర్ మోసానికి గురైతే హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు ఫోన్‌లో ఫిర్యాదు చేయాలని లేదా www.cybercrime.gov.inలో లాగిన్ అయి కూడా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. సైబర్ మోసానికి గురైన గంటలోపు ఫిర్యాదు చేస్తే అనుమానితుని బ్యాంక్ అకౌంటులో ఉన్న డబ్బులు హోల్డ్ చేయడం వీలవుతుందని తెలిపారు. ఫిర్యాదు స్టేటస్ తెలుసుకోవడానికి జిల్లాలో ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్స్‌ను నియమించినట్లు తెలిపారు. వీరు డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో పనిచేస్తారని పేర్కొన్నారు. డీఎస్పీ శివభాస్కర్(8712665578), ఇన్‌స్పెక్టర్ రమణ (8712665627) ను సంప్రదించాలని సూచించారు.

సైబర్ వారియర్స్: పేర్లు, ఫోన్ నంబర్లు

పేరు	ప్రాంతం	ఫోన్ నంబర్	పేరు	ప్రాంతం	ఫోన్ నంబర్
			ఎం.శంకర్	కడెం	8712658678
			కె.రజిత	దస్తురాబాద్	8712658198
అక్షయ్ కుమార్	నిర్మల్ టౌన్	8712659653	వి.నవీన్‌కుమార్	పెంబి	8712659654
పి.నందిని	నిర్మల్ రూరల్	8712659652	ఎ.హరిణి	భైంసాటౌన్	8712658197
ఎండీ.యాసీన్	దిలావర్‌పూర్	8712658198	ఆర్.కృష్ణ	భైంసా రూరల్	8712658195
ఇ.వినోద్	సారంగాపూర్	8712659655	ఎ.జగదీష్	కుంటల	8712659646
ఇ.మహేందర్	నర్సాపూర్(జి)	8712659651	శ్రీకాంత్	కుభీర్	8712659645
పి.రాజు	సోన్	8712659656	ఎ.కిరణ్ కుమార్	ముధోల్	8712659650
ఎం. కిరణ్	లక్ష్మణచాంద	8712659647	కె.మైథిలి	లోకేశ్వరం	8712659648
ఎం.దయాకర్	మామడ	8712659649	ఎ.రమేశ్	తానూరు	8712659657
రవికుమార్	ఖానాపూర్	8712659499	ఆర్.మోహన్	బాసర	8712658195